క్లుప్తంగా

'చండీయాగానికి రండి'



దామెర : చండీయాగానికి రావాలని వరంగల్ ఎంపీ కడియం కావ్యను దూపదీప నైవేద్య అర్చక సంఘం సభ్యులు గురువారం ఆమె నివాసంలో కలిసి ఆహ్వానించారు. అర్చకులు మాట్లాడుతూ.. ఈనెల 14, 15, 16న హైదరాబాద్‌లో పంచకుండాత్మక చండీ కుబేర పాశుపత యాగం నిర్వహించనున్నట్లు తెలిపారు. యాగ నిర్వహణ, ఏర్పాట్లు తదితర అంశాలు ఎంపీకి వివరించి యాగానికి హాజరుకావాలని కోరారు. లోక కల్యాణార్థం యాగం నిర్వహించడం శుభపరిణామంగా భావిస్తున్నట్లు ఎంపి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాలకు పెద్ద పీట వేస్తుందని అన్నారు. ఎంపీని కలిసిన వారిలో దూపదీప నైవేద్య అర్చక సంఘం జిల్లా అధ్యక్షుడు గణేశ్‌కుమార్, కోశాధికారి కొలనుపాక వీరమల్లయ్య, ఉపాధ్యక్షుడు లక్ష్మీకాంత్‌శర్మ తదితరులు ఉన్నారు.

'గ్యాస్ కనెక్షన్ అని చెప్పి భూమి పట్టా చేసుకున్నాడు'

ఎల్కతుర్తి : తాను సంపాదించుకున్న భూమిని తన కొడుకు అక్రమంగా పట్టా చేసుకున్నాడని, ఆ పట్టాను రద్దు చేయాలని ఓ తల్లి ఆవేదన వ్యక్తం చేసింది. ఈ సంఘటన భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గ్రామానికి చెందిన జుర్రు కొమురమ్మకు ముగ్గురు కుమారులు ఉన్నారు. రెండో కుమారుడు సంపత్ గ్యాస్ కనెక్షన్ కోసమని కొమురమ్మను తీసుకువెళ్లి 7గుంటల భూమిని అక్రమంగా పట్టా చేసుకున్నాడు. ఈ విషయమై కొన్నేళ్ల నుంచి వారి కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. ఇదే విషయంలో అధికారులు ఇరువురిని బైండోవర్ చేసి కౌన్సెలింగ్ నిర్వహించారు. తాను సంపాదించిన ఆస్తి ముగ్గురు కొడుకులకు చెందుతుందని, రెండో కుమారుడైన సంపత్ అక్రమంగా పట్టా చేసుకుని ఇబ్బందులకు గురి చేస్తున్నాడని అధికారులు న్యాయం చేయాలని వేడుకుంది.

కల్తీ కల్లు విక్రయిస్తే కఠిన చర్యలు

కమలాపూర్ : కల్తీ కల్లు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ, హనుమకొండ ఎక్సైజ్ ఎస్సై వెంకన్న హెచ్చరించారు. కమలాపూర్, వంగపల్లి గ్రామాల్లోని తాటికల్లు మండువాలను గురువారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో తాటికల్లు శాంపుల్స్ సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. పోలీస్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక డంపు సీజ్

ఐనవోలు : మండలంలో రెవెన్యూ, మైనింగ్, పోలీస్ శాఖల అధికారులు సంయుక్తంగా ఇసుక డంపులపై గురువారం దాడులు నిర్వహించారు. బుధవారం లింగమోరిగూడెంలో రెండు డంపులను సీజ్ చేయగా గురువారం మరో ఇసుక డంపును సీజ్ చేశారు. ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆకేరు వాగు పరిసర ప్రాంతమైన నందనంలో సుమారు 70 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక డంపును గుర్తించామన్నారు. అధికారుల సమక్షంలో వెంటనే సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. ప్రాథమిక విచారణలో గజ్జెల శ్రీరాములుకు చెందిన భూమిలో ఆరెల్లి లక్ష్మయ్య అక్రమంగా నిల్వ చేసినట్లు తెలిసిందని ఎస్సై వెల్లడించారు.

ప్రింటర్, స్కానర్ బహూకరణ

కమలాపూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు గ్రానైట్ అసోసియేషన్ వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చక్రధర్‌రెడ్డి రూ.21 వేల విలువచేసే ప్రింటర్, స్కానర్, జిరాక్స్ మిషన్‌ను గురువారం అందించారు. కళాశాలకు ప్రింటర్, స్కానర్‌ను బహూకరించిన చక్రధర్‌రెడ్డికి ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

108 వాహనం ఆకస్మిక తనిఖీ

ఐనవోలు : మండల కేంద్రంలోని 108 అంబులెన్స్ వాహనాన్ని ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ నసీముద్దీన్, హనుమకొండ జిల్లా ఈఎంఈ శ్రీనివాస్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి 108 వాహన సిబ్బంది ఈఎంటీ సోమశ్వేర్, పైలట్ అశోక్‌రెడ్డికి పలు సూచనలు చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.

బెల్టు షాపు నిర్వాహకుడిపై కేసు

దామెర : బెల్టు షాపు నిర్వహిస్తూ అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బీమారపు రాజయ్య బెల్టు షాపు ఏర్పాటు చసి మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. దీంతో దాడులు నిర్వహించగా రాజయ్య ఇంటి ఆవరణలో రూ.6,970 విలువచేసే బీరు, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

- కేంద్ర ప్రభుత్వ పథకాలకు కీలకం
- ఐనవోలులో 10 రెవెన్యూ గ్రామాలు, 14,500 మంది రైతులు
- ఇప్పటి వరకు 5,186 మంది నమోదు



ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు



రైతుల వివరాలు యాప్‌లో నమోదు చేస్తున్న ఏఈఓ అనూష

ఐనవోలు : అన్నదాతలకు పారదర్శకంగా వివిధ పథకాలు అందే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ఫార్మర్ రిజిస్ట్రేషన్‌కు శ్రీకారం చుట్టింది. భూమి ఉన్న ప్రతి రైతుకు 14 అంకెలతో కూడిన గుర్తింపు నంబర్‌ను కేటాయించి డిజిటలైజేషన్ ప్రక్రియను ప్రారంభించింది.

రిజిస్ట్రేషన్ ఎలా..

రైతులు ఆధార్ కార్డు నంబరు చెబితే ఏఈఓలు ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేస్తారు. ఆధార్ లింక్ ఉన్న సెల్‌ఫోన్‌కు మూడు సార్లు ఓటీపీలు వస్తాయి. ఈ ఓటీపీలు సంబంధిత అగ్రిస్టాక్ వెబ్‌సైట్‌లో నమోదు చేస్తే 14 అంకెల ఫార్మర్ ఐడీ క్రియేట్ అవుతుంది. దీంతో రిజిస్ట్రీ ప్రక్రియ పూర్తి అయినట్లు నిర్ధారించుకోవచ్చు.

మండలంలో 14,500 మంది రైతులు

ఐనవోలు మండలంలో 10 రెవెన్యూ గ్రామాలు 17 అనుసంధాన గ్రామాలు ఉండగా 5 వ్యవసాయ క్లస్టర్‌లుగా విభజించారు. ఒక్కో క్లస్టర్‌లో ఏఈఓలు క్షేత్రస్థాయిలో రైతులకు ఫార్మర్ ఐడీ గురించి వివరించి నమోదు చేస్తున్నారు. సుమారుగా 14,500 మంది పాస్‌బుక్‌లు కలిగిఉండగా ప్రక్రియ ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా కేవలం 5,186 మంది రైతుల వివరాలు మాత్రమే అధికారులు నమోదు చేశారు. దీంతో ఫార్మర్ రిజిస్ట్రేషన్ అలస్యంగా కొనసాగుతున్నట్లు పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఎలాగైనా ప్రక్రియను వేగవంతం చేయాలని కొన్ని చోట్ల ఏఈఓలు ప్రైవేటు వ్యక్తులతో రిజిస్ట్రేషన్ ప్రకియను చేయిస్తున్నారు. వాస్తవానికి ఈ ప్రక్రియకు ఎలాంటి చార్జీలు ఉండవు. కాని ప్రైవేటు వ్యక్తులు ప్రతి రైతు నుంచి రూ.25 వసూలు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీతో ఉపయోగం..

రైతులకు ప్రత్యేకంగా గుర్తింపు కార్డు ఇవ్వడం కోసం కేంద్ర ప్రభుత్వం ఫార్మర్ రిజిస్ట్రేషన్‌కి శ్రీకారం చుట్టింది. రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత ప్రతి రైతుకు ఒక యూనిక్ గుర్తింపు సంఖ్య కేటాయింపబడుతుంది. ఈ గుర్తింపు సంఖ్యనే కేంద్ర ప్రభుత్వ పథకాలకు, సబ్సిడీలకు, రుణాలకు ఉపయోగపడనున్నట్లుగా అధికారులు పేర్కొంటున్నారు. ఫార్మర్ ఐడీ లేకుంటే భవిష్యత్‌లో కేంద్ర ప్రభుత్వం అందించే ఏ పథకానికైనా అర్హత ఉండదని చెబుతున్నారు.

రైతులకు ఉపయోగం



రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకుని ఫార్మర్ ఐడీని కలిగి ఉండాలి. రానున్న రోజుల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలకు తప్పని సరి చేసే అవకాశం ఉంది. 2019 ఫిబ్రవరి వరకు రిజిస్టర్ చేసుకున్న రైతులకు మాత్రమే కేంద్రం మూడు విడతలుగా అందించే రూ.6వేల నగదు వస్తుంది. ప్రభుత్వం అవకాశం కల్పిస్తేనే మిగతా వారికి వస్తుంది. ఫార్మర్ రిజిస్ట్రీకి ఎలాంటి రుసుము లేదు. ప్రస్తుతానికి ముగింపు గడువంటూ ఏమి లేదు. రైతులు త్వరగా ఫార్మర్ ఐడీని పొందాలి. - సునీల్‌కుమార్, ఏఓ

మొక్కల పెంపకంతో కాలుష్య నివారణ

● ఏపీఓ శారద



మొక్కలు అందజేస్తున్న ఏపీఓ శారద

దామెర : మొక్కల పెంపకంతో కలుష్య నివారణ సాధ్యమవుతుందని ఏపీఓ శారద అన్నారు. వన మహోత్సవంలో భాగంగా 'నాటుదాం ఒక చెట్టు -అమ్మ పేరు మీద' నినాదంతో మండలంలోని వెంకటాపూర్, సింగరాజుపల్లిలో గురువారం మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని సూచించారు. నాటిన మొక్కలను సంరక్షించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీల్లో పండ్ల, పూల మొక్కలతో పాటు నీడనిచ్చే మొక్కలు అందుబాటులో ఉన్నాయన్నారు. గ్రామస్తులకు కావలసిన మొక్కలు నాటుకోవాలని కోరారు. జీపీ కార్యదర్శులు రజిత, సందీప్, పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు పింఛన్లు ఇవ్వాలి



సూపరింటెండెంట్ సులోచనకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

శాయంపేట : జియోటాగ్‌తో సంబంధం లేకుండా చేనేత కార్మికులకు ఆసరా పింఛన్లు ఇవ్వాలని తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు వంగరి సాంబయ్య కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్ సులోచనకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సాంబయ్య మాట్లాడుతూ.. చేనేత కార్మికులకు ఉపాధి భద్రత లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత కార్మికులు ఆత్మహత్య చేసుకోకుండా ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో 50 సంవత్సరాలు నిండి అర్హులైన ప్రతీ చేనేత కార్మికుడికి ఆసరా పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆ సంఘం ప్రధాన కార్యదర్శి సామల ధనుంజయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్, నాయకులు బాలకృష్ణ, శాంత, రవి, మల్లికార్జున్, ప్రభాకర్, సంతోశ్, సత్యనారాయణ, ముకుందం, దేవరాజ్, శేఖర్, రవి, మహేందర్, రాజు పాల్గొన్నారు.

'విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలి'



ధర్మసాగర్ : తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జాక్ సభ్యులు

ధర్మసాగర్ : రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు బస్ సౌకర్యం కల్పించాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జాక్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ సదానందానికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా జాక్ సభ్యులు మాట్లాడుతూ.. దూర ప్రాంతాల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సరియైన రవాణా సదుపాయం లేకపోవడంతో చదువుపై శ్రద్ధ వహించలేకపోతున్నారని అన్నారు. ప్రతి 30 మంది విద్యార్థులకు ఒక బస్ చొప్పున ఏర్పాటు చేసి స్కూల్‌కు తీసుకెళ్లే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని అన్నారు. పేద విద్యార్థులు చదువుకునేలా రాష్ట్ర ప్రభుత్వం చొరువ చూపాలని, మండల స్థాయిలోని పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్ పాఠశాలలుగా ఏర్పాటు చేయాలని వినతిలో పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, జాక్ సభ్యులు కొట్టె యోసోబు, ఎల్లస్వామి, దినేష్, రాజు, కుమారస్వామి, దయాకర్, నవీన్ కుమార్, బాబు, భిక్షపతి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఐనవోలు : విద్యార్థులు బడిబాట పట్టాలంటే ప్రభుత్వం ఉచిత బస్సు సదుపాయం కల్పించాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకుడు కొత్తూరి ప్రవీణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జేఏసీ నాయకులతో కలిసి గురువారం తహసీల్దార్ విక్రమ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం ప్రవీణ్ మాట్లాడుతూ.. తెలంగాణలో బీసీ, ఎస్సీ, ఎస్టీ రైట్స్ అండ్ రాజ్యాధికార సాధన జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ విశారధన్ మహరాజ్ ఆదేశాల మేరకు వినతిపత్రం అందించినట్లు తెలిపారు. తమ డిమాండ్లను నెరవేర్చని పక్షంలో ఆందోళన చేపడుతామని, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి జేఏసీ అండగా నిలుస్తుందన్నారు. విష్ణు, జయపాల్, సాయికిరణ్, నిరంజన్, రాజు పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత బస్సులు ఏర్పాటు చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ రైట్స్ రాజ్యాధికార సాధన జేఏసీ జిల్లా కోఆర్డినేటర్ మైదం రవి ప్రతభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ జగన్ మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందించారు.

'మహిళా శక్తి'తో ఆర్థికంగా ఎదగాలి



పరకాల : మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్



దామెర : అవగాహన కల్పిస్తున్న కళాకారులు

● మున్సిపల్ కమిషనర్ సుష్మ

పరకాల : ఇందిరా మహిళా శక్తి పథకాన్ని వినియోగించుకొని ప్రతీ మహిళా ఆర్థికంగా ఎదగాలని పరకాల మున్సిపల్ కమిషనర్ సుష్మ పిలుపునిచ్చారు. 100 రోజుల కార్యాచరణలో భాగంగా పరకాల మున్సిపాలిటీలో గురువారం ఇందిరా మహిళా శక్తి సంబురాలు నిర్వహించారు. సాంస్కృతిక సారథి కళాకారులు కళాజాత నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రతి మహిళా తన నైపుణ్యానికి అనుగుణంగా ఆర్థికంగా నిలదొక్కుకొని కోటీశ్వరురాలిగా ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఎంపీడీఓ ఆంజనేయులు, ఆర్‌ఓ.ఏ.రఘు, మెప్మా ఏడీఎంసీ సతీష్, వార్డు ఆఫీసర్స్, టీఎల్ఎఫ్ సభ్యురాళ్లు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

దామెర : మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని ఏపీఎం ఝాన్సీ అన్నారు. మహిళా ఇందిరా శక్తి సంబురాల్లో భాగంగా మండల కేంద్రంలో గురువారం సాంస్కృతిక సారథి కళాకారులు కళాజాత నిర్వహించారు. వడ్డీలేని రుణాలు, మహిళా సాధికారత, మహిళా సంఘాలకు జీవిత బీమా వంటి పథకాలపై కళాకారులు పాడిన పాటలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఏపీఎం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వినియోగించుకోవాలని, వ్యాపార రంగాల్లో మహిళలు రాణించాలన్నారు. మండలంలోని ల్యాదెళ్లలో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ శిబిరాలు నిర్వహించి కుటీర పరిశ్రమలు స్థాపించే విధంగా ఎమ్మెల్యే చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు జ్యోత్స్న, దేవేందర్, వెంకటేశ్, సారంగపాణి, రవి, రజియా, చైతన్య, జానకి, వేదవతి, రాజేశ్వరి, వీఓలు, వీఏఓలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

'గ్రామాల్లో కుంటుపడుతున్న అభివృద్ధి'



ఐనవోలు : గ్రామాల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించడం లేదని, అభివృద్ధి కంటుపడిందని బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ తంపుల మోహన్, మండల ఇన్‌చార్జ్ గుజ్జ గోపాల్‌రావు విమర్శించారు. గురువారం మండలంలోని రాంనగర్, నందనం గ్రామాల్లో ఆ పార్టీ కార్యకర్తల సన్నాహక సమావేశం జరుగగా వారు హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల పేరుతో గత ఎన్నికల్లో ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిందన్నారు. కానీ ఇప్పటి వరకు ఆరు గ్యారంటీలను అమలు చేయలేదని ఆరోపించారు. సర్పంచ్‌ల పదవీకాలం పూర్తయి 16 నెలలు గడుస్తున్నా ఎన్నికలు నిర్వహించలేదని, గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోయాయని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. గ్రామ ఇన్‌చార్జ్‌లు వేణు, రాకేష్, జయశంకర్, జగపతి, రఘువంశీ, క్రాంతి, సుదర్శన్, దేవదాస్, అశోక్, రాజేంద్ర ప్రసాద్, ఎస్‌కే జిందా, శ్రీను పాల్గొన్నారు.

ఆలయాల్లో వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు



ఐనవోలు : మధుకర్‌శర్మకు మల్లన్న చిత్రపటాన్ని అందజేస్తున్న ఈఓ



ఆత్మకూరు : పల్లకి సేవలో పాల్గొన్న భక్తులు



కమలాపూర్ : అన్నప్రసాద వితరణ చేస్తూ..

శాయంపేట : మండల కేంద్రంలోని మత్స్యగిరి స్వామి దేవాలయ ప్రాగణంలో గల సాయిబాబా మందిరంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం 108 కలశాలతో పాలు, పెరుగు, తేనే, నెయ్యి పంచామృతాలతో సాయిబాబాకు ఆలయ అర్చకుడు ఆరుట్ల కృష్ణమాచార్యులు అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మామునూరు ఏసీపీ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ కల్వల సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ ప్రభావతి గురుపౌర్ణమి ఉత్సవాల్లో పాల్గొనగా వారికి ఆలయ కమిటీ చైర్మన్ సామల భిక్షపతి, మాజీ సర్పంచ్ రవి శాలువాతో సత్కరించారు. అనంతరం మండల కేంద్రంలోని గాంధీ చౌక్‌లో సాయిబాబా సత్సంగ్ మందిరం ఆవరణలో శ్రీ సాయి సేవా ట్రస్ట్ పరపతి సంఘం ఆధ్వర్యంలో మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. మాజీ ఉపసర్పంచ్ సుమన్, శంకరాచారి, రాజేందర్, రమేశ్‌బాబు, వెంకటపతి, కుమారస్వామి, వేణు, ప్రకాశం, సుమన్, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. షిరిడీ సాయిబాబా ఆలయంలోని సాయిబాబా విగ్రహాన్ని భక్తజనం నడుమ పురవీధులగుండా పల్లకి సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్దెత్తున మంగళ హారతులతో తరలివచ్చి సాయిబాబాను దర్శించుకుని తీర్థ ప్రసాదలు స్వీకరించారు. సాయిబాబా ఆలయానికి ఆత్మకూరు, తిరుమలగిరి, గూడెప్పాడు గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి బాబాను దర్శించుకుని అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి పవన్‌కుమార్‌శర్మ భక్తుల చేత ప్రత్యేక పూజలు జరిపించారు. దీంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అనంతరం ఆలయంలో ఆలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహా అన్నదానం చేపట్టారు. ఆలయ ట్రస్ట్ చైర్మన్ చంద్రారెడ్డి, ఉపాధ్యక్షుడు సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శి సతీష్, ఆలయ కమిటీ సభ్యులు విజేందర్, మహేందర్‌రెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

ఐనవోలు : మండలంలోని పలు ఆలయాల్లో గురుపౌర్ణమిని వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఆలయ ముఖ్య అర్చకుడు మధుకర్‌శర్మను ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, ఆలయ అర్చక సిబ్బంది శాలువాతో సత్కరించారు. ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకుడు పాతర్లపాటి శ్రీనివాస్, వేద పారాయణదారులు గట్టు పురుషోత్తమశర్మ, విక్రాంత్ వినాయక్ జోషి, అర్చకులు భానుప్రసాద్ శర్మ, మధుశర్మ, నరేశ్‌శర్మ, దేవేందర్, సీనియర్ అసిస్టెంట్ కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్, మర్రిపల్లిగూడెం గ్రామాల్లో గురువారం గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉప్పల్‌లో శ్రీసాయిబాబా ఆలయం, మర్రిపల్లిగూడెంలో శ్రీసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దాతల సహకారంతో భక్తులకు అన్న ప్రసాద వితరణ చేపట్టారు. ఆలయ అర్చకులు, భక్తులు, శ్రీసాయి సేవా సమితి సభ్యులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : మండల కేంద్రంలోని గురుదత్తసాయి శివాలయం, భీమదేవరపల్లి మండలంలోని పలు ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. గురుదత్తసాయి ఆలయాల్లో అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు.

'బీసీ రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించాలి'



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎల్కతుర్తి : ఎన్నికల ముందు కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కేటాయించి చట్టబద్ధత కల్పించాలని మాజీ ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు గడిగల కుమార్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ చట్టబద్ధత కల్పించకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. బీసీ సామాజిక వర్గానికి మొత్తం జనాభా సర్వే చేపట్టాలని, 33శాతం మహిళ రిజర్వేషన్లలో కూడా మహిళలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాట తప్పి ఎన్నికలు నిర్వహిస్తే బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. స్టేట్ కార్పొరేషన్ చైర్మన్లలో 42శాతం బీసీలకు అవకాశం కల్పించాలన్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చని పక్షంలో పార్టీలకు అతీతంగా బీసీలంతా ఈనెల 15వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం మహాధర్నా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవీందర్, సూర్యయాదవ్, ప్రణీత్, ప్రకాశ్, వీరేశ్, నవీన్‌సాగర్, రాజేష్, రవీందర్‌గౌడ్, నగేష్, శేషగిరి, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ ఎంఈఓను నియమించాలి

● ఎస్ఎఫ్ఐ నాయకుల డిమాండ్

పరకాల : విధులకు హాజరు కాకుండా ప్రైవేటు విద్యా సంస్థలకు ఇన్‌చార్జ్ ఎంఈఓ రమాదేవి కొమ్ముకాస్తున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ ఆరోపించారు. గురువారం పట్టణ కేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రం (ఎంఈఓ కార్యాలయం) ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆమె విధులకు హాజరుకాకపోవడంతో కుర్చీకి వినతిపత్రం అందించి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పట్టణంలోని ప్రైవేటు విద్యా సంస్థలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేయడంతో పాటు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు విక్రయిస్తున్నా ఇన్‌చార్జ్ ఎంఈఓ చర్యలకు వెనుకాడుతున్నారని ఆరోపించారు. తక్షణమే ఆమెను సస్పెండ్ చేసి రెగ్యులర్ అధికారిని నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి జశ్వంత్, జిల్లా కమిటీ సభ్యులు సాయికుమార్, సాయితేజ, గణేశ్, శశాంక్, సందీప్, అజయ్ పాల్గొన్నారు.

బయో పురుగుమందుల సీజ్



శాయంపేట : మండలంలోని కొప్పుల గ్రామంలో గల రైతుమిత్ర ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్‌లో పరకాల సహాయ వ్యవసాయ సంచాలకుడు (ఏడీఏ) శ్రీనివాస్ ఏఓ గంగాజమునతో కలిసి గురువారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. 60 కంపెనీలకు చెందిన బయో పురుగు మందులను, 30 కంపెనీ లకు చెందిన గడువు దాటిన పురుగుమందులు, ఇఫ్కో కంపెనీకి చెందిన నానో యూరియాను గుర్తించి సీజ్ చేసినట్లు తెలిపారు. వీటి విలువ రూ. 9లక్షల 14వేలు ఉంటుందని తెలిపారు.

ఓటరు నమోదుపై దృష్టిసారించాలి

● ఆర్డీఓ నారాయణ



మాట్లాడుతున్న ఆర్డీఓ నారాయణ

నడికూడ : ఓటరు నమోదుపై దృష్టిసారించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆర్డీఓ నారాయణ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నూతన ఓటరు నమోదుపై బూత్ స్థాయి అధికారులకు (బీఎల్ఓ) శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. ఓటరు నమోదు, తొలగింపు, బదిలీలు, మార్పులు, చేర్పులకు సంబంధించి విషయంపై బీఎల్ఓలు అప్రమత్తంగా ఉండాలని, 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరు నమోదు చేసుకునే విధంగా చైతన్య పర్చాలన్నారు. ఈ శిక్షణలో ఓటు నమోదు యాప్ ఎలా ఉపయోగించాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాణి, డిప్యూటీ తహసీల్దార్‌లు సత్యనారయణ, సూర్యప్రకాశ్, భద్రయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి



కమలాపూర్ : ఈనెల 13న మహబూబ్‌నగర్ రెడ్‌క్రాస్ సొసైటీ హాల్‌లో నిర్వహించనున్న కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి (కేఏఎన్‌పీఎస్) రాష్ట్ర 2వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గన్నారపు సరోజన పిలుపునిచ్చారు. కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి కరపత్రాలను గురువారం మండల కేంద్రంలో ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. కేఏఎన్‌పీఎస్ రాష్ట్ర మహాసభలకు పీడిత ప్రజలు, మేధావులు, మహిళలు, యవకులు తరలిరావాలని పిలుపునిచ్చారు.